క్లుప్తంగా

గ్రామాల్లో మొబైల్ వైద్య సేవలు



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

దెందులూరు: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులకు అందించే మొబైల్ వైద్య సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు అన్నారు. గురువారం గోపన్నపాలెంలో సీజనల్ వ్యాధుల తోపాటు ఇతర వ్యాధులు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిర్దేశించిన తేదీల్లో గ్రామాలకు మొబైల్ వ్యాన్ వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుందని గ్రామాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీహెచ్ఈఎల్ వైద్య సిబ్బంది ప్రజలకు విస్తృత ప్రచారం అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన అపర్ణ

దెందులూరు: కారు ఢీకొని మోటార్‌సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై సత్యనారాయణపురం వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేదినరావుపాలెంకు చెందిన భార్యభర్తలు తానంకి రాధాకృష్ణ, అపర్ణ భీమడోలులో ఉన్న బంధువు ఇంటికి వెళ్తుండగా సత్యనారాయణపురం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో రాధాకృష్ణ, అపర్ణలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, మేదినరావుపాలెం సర్పంచ్ ఎం దుర్గా కుమారిరాజు క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఏలూరుకు, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే



గణపవరంలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: మలేరియా తదితర అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన గణపవరంలో ఇంటింటా నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మలేరియా పరీక్షలు చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఫీవర్ సర్వే, ఎన్‌సీడీ సర్వేపై ఆరా తీశారు. ఇంటికి వచ్చిన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు పూర్తి వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య కార్యకర్తలు యోహాన్, జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

నేడు, రేపు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

దెందులూరు: కొవ్వలి జెడ్పీ హైస్కూల్లో దెందులూరు నియోజకవర్గం స్థాయి సెకండరీ స్కూల్స్ ఆటలపోటీలు ఈనెల గురు, శుక్రవారాల్లో కొవ్వలి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించనున్నట్టు హెచ్ఎం జీఎస్ఎల్ఎన్‌వీ శర్మ, ఫిజికల్ డైరెక్టర్లు జె సురేష్‌కుమార్, గవ్వా శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాఠశాలలో వారు మాట్లాడుతూ 21న బాల బాలికలకు అథ్లెటిక్స్, 22న గేమ్స్ నిర్వహిస్తామన్నారు. అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, డిస్క్‌కస్‌త్రో పోటీలు నిర్వహిస్తామన్నారు. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, కోకో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఎంట్రీ ఫారం కొవ్వలి ఉన్నత పాఠశాల అందజేయాలని తెలిపారు.

సామాజిక న్యాయం అందరికీ అందాలి

గణపవరం: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం సమానంగా అందించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం డిగ్రీ కాలేజీలో సోషల్ వర్క్, చరిత్ర శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ న్యాయం అన్ని వర్గాల ప్రజలకు సమంగా అందినప్పుడే సామాజిక న్యాయం ఉద్దేశ్యం నెరవేరుతుందన్నారు. సమావేశంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, శారదా దేవి, కె.స్వరూపరాణి, పిభాస్కరరావు, జి.వెంకట్రావు, షేక్‌పర్వీన్ తదితరులు సామాజిక న్యాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బడిలో భాషల సంబరాల సందడి

- నేటితో ముగియనున్న భాషోత్సవాలు
- మాతృభాషా దినోత్సవానికి ఏర్పాట్లు



వక్తృత్వం పోటీలో పాల్గొన్న కొమ్మర యూపీ స్కూల్ విద్యార్థులు



హిందీ భాషపై విద్యార్థులు తయారు చేసిన బోధనోపకరణాలు

నిడమర్రు: ఇతర భాషలను ఎన్నో నేర్చినప్పటికీ తల్లి భాష లేనిదే ఏ వ్యక్తి గొప్పవాడు కాలేడు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ అంతర్జాతీయ భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 18వ తేదీ నుంచి భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు శుక్రవారంతో ముగియనున్నాయి. దీనిలో భాగంగా ప్రతి పాఠశాలలో అంతర్జాతీయ భాషా దినోత్సవం నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని కోసం ప్రతి పాఠశాలకు రూ.500 నిధులు విడుదల చేసారు. ప్రతి మనిషి అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషనూ కాపాడుకోవాలి, జీవితంలో ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోక తప్పదు. వాటి ప్రభావం అమ్మ భాషపై పడకుండా చూసుకోవాలంటూ ఈ నాలుగు రోజులు పాఠశాలల్లో నిర్వహిస్తున్న భాషోత్సవాల సారాంశంగా ఉపాధ్యాయులు చెపుతున్నారు.

నేడు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు

ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ భాషల సంబరాల్లో 19న ఆంగ్లం, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన భాషతోపాటు, మన రాష్ట్ర సరిహద్దు రాష్ట్రాలకు చెందిన మాతృ భాషలైన కన్నడం, తమిళం, ఒరియా భాషలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు.

భాషపై పట్టు సాధించే అంశాల్లో..

ఎంపిక చేసిన భాషకు సంబంధించి ఆయా తేదీల్లో రీడింగ్, షార్ట్ స్టోరీలు చెప్పడం, వ్యాసరచన, చర్చ, వక్తృత్వం, స్పెల్ చెక్, రోల్ ప్లే, బోధనపకరణాల తయారీ వంటి అంశాల్లో విద్యార్థులు పోటీలు జరుగుతున్నాయి. సంస్కృతంలో శ్లోకాలు, ఉర్దూ గజల్స్ చెప్పే అవకాశం కల్పించారు. ఈ అంశాలు ఆయా భాషలపై పట్టు సాధించేలా పోటీలు పొందించారు. గిరిజన భాషలు, సంస్కృతి ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థి ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడతాయని ఉపాధ్యాయులు చెపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.500 ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏమాత్రం సరిపోవని, ఉపాధ్యాయులు, దాతల సహకారంతో ఈ భాషోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు చెపుతున్నారు.

మండలాలకు అందిన నిధుల వివరాలు

మండలం	పాఠశాలలు	మంజూరు
నిడమర్రు	33	రూ.16,500
గణపవరం	48	రూ.24,000
భీమడోలు	37	రూ.18,500
ఉంగుటూరు	56	రూ.28,000
మొత్తం	174	రూ.87,000

ఇతర భాషలపై అవగాహన



తెలుగుతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు మాతృభాషలతోపాటు, గిరిజన భాషలు, వారి కట్టు బొట్లు, ప్రాస వంటి వాటిపై ఉపాధ్యాయులు వివరించారు. దీంతో తెలుగుతోపాటు ఇతర భాషలపై మా తరగతిలోని విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కలిగింది.

– కిక్కిశెట్టి పవిత్ర, 7వ తరగతి విద్యార్థిని

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఏటా పాఠశాలలో మాతృ భాష దినోత్సవం నిర్వహిస్తాం. తల్లి ఒడి నుంచి నేర్చుకునే మొట్ట మొదటి భాష మాతృభాష. ఈ సారి భాషోత్సవాల్లో ఇతర భాషలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాం. పాఠశాలకు అందిన నిధులతోపాటు నేను కొంత సొమ్ము కేటాయించి విజేతలకు బహుమతులు అందిస్తున్నాం.

– జి. పార్వతి, స్కూల్ అసిస్టెంట్, తెలుగు

క్షయవ్యాధిపై అపోహలు వద్దు

గణపవరం: క్షయవ్యాధిపై అపోహలు విడనాడాలని, క్షయవ్యాధి లక్షణాలుంటే వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి కళ్లె పరీక్షలు చేయించుకుని, ఉచిత చికిత్స పొందాలని గణపవరం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ప్రియాంక అన్నారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం పీహెచ్‌సీల పరిధిలో క్షయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్ధారణ, చికిత్స ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీ సూపర్‌వైజర్లు కె.గిరిబాబు, రమేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీ టీచర్‌పై కుక్కల దాడి



కుక్కల దాడితో అంగన్‌వాడీ టీచర్ చేతికి గాయమైన దృశ్యం

దెందులూరు: శ్రీరామవరంలోని దళితవాడలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ భారతిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఉదయం 9 గంటల సమయంలో అంగన్‌వాడీ చిన్నారులను ఆమె కేంద్రానికి తీసుకొస్తుండగా పిల్లలపైకి కుక్కలు దాడి చేయగా టీచర్ భారతి అడ్డుకుంది. దీంతో ఆమెపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో భారతి చేతికి, కాలికి పలుచోట్ల గాయాలయ్యాయి. దీంతో స్థానికులు భారతిని ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. వీధి కుక్కల నివారణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కృషి



భీమడోలులో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పంకజ్‌కుమార్

భీమడోలు: ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా సమగ్రాశిక్షాభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్‌కుమార్ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ సర్టిఫికెట్ కోర్సు 120 రోజుల జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన శిక్షణ తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. నిర్దేశించిన కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు పొందుతున్న శిక్షణపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్ హెచ్ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్, ఏఎంవో ఆర్. రామారావు, ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా జ్ఞానజ్యోతి కార్యక్రమం లక్ష్యమన్నారు. తెలుగు, గణితం బోధనలపై శిక్షణ కార్యక్రమాల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించి, విద్యా సేవలను అందించేందుకు దోహద పడతాయన్నారు. 120 రోజులు పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డీఆర్‌పీలు ఎం.శరీన్, నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, సూపర్‌వైజర్లు ఎం.కవిత, నూర్జహాన్ నిర్దేశించిన కార్యక్రమాలను నిర్వహించడంపై అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 53 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు సత్యప్రసాద్, రాధాకృష్ణ, రమణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'జ్ఞాన జ్యోతి' శిక్షణ

పెదపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన బోధన అందించేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతో తోడ్పాటునిస్తుందని పెదపాడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడవ రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలకు డీఆర్పీలు పుష్పకిరణ్, బాల సుబ్రహ్మణ్యం శ్రీనివాస్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎంఎస్ రాజశేఖర్, షేక్ ఫాతిమా బేగం, కె కుమారి రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఉంగుటూరు: అంగన్‌వాడీ పాఠశాలల్లోని చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి టీచర్లు కృషిచేయాలని ఏపీసీ పంకజ్ కుమార్ అన్నారు. మూడవ రోజు జ్ఞాన జ్యోతి అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడో రోజు శిక్షణ ఉంగుటూరు హైస్కూల్లో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం సందర్శించిన పంకజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ కోర్సు శిక్షణతో అంగన్‌వాడీ కార్యకర్తలు టీచరుగా గౌరవాన్ని పొందుతారన్నారు. ఎంఈవో– 2 రెడ్డి రామారావు మాట్లాడుతూ అభ్యసనలో వెనుకబడిన పిల్లలను గుర్తించి, వారిలోని నైపుణ్యాలను, సామర్థ్యాలను అభివృద్ధి చేయాలన్నారు. మూడోరోజు శిక్షణలో 3 నుంచి 6 ఏళ్ల వయస్సు వారికి ఆటపాటలతో బోధనపై అవగాహన కల్పించారు. డీవైఈవో రవీంద్రభారతి పర్యవేక్షించారు. హెచ్ఎం మీరాకుమారి, ఆర్పీలు అల్లు శ్రీను, శిరికి శివ, యు.శివకుమార్, డి. శారదామణి శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలి



గణపవరం కాలేజీలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గణపవరం: ఇంటర్ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని, పోషకాహారాన్ని తీసుకోవాలని గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సర విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. మరో పది రోజుల్లో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు కారుమూరి సునీల్ పరామర్శ



తాతా సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త సునీల్

దెందులూరు/పెదవేగి : ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ నేతల కుటుంబాలను పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పెదవేగి మండలం అంకన్నగూడెం ఎంపీటీసీ పిల్లి రామకృష్ణ ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఇటీవల మరణించిన పెదవేగి మండలం సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మేక లక్ష్మణరావు, పార్టీ జిల్లా కార్యదర్శి డీవీఆర్‌కే చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి, మండల కన్వీనర్ జనంపేట బాబు, మెట్ల పల్లి సూరిబాబు పాల్గొన్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవాలు

పెదపాడు : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. గురువారం పెదపాడు మండలంలోని సత్యవోలులో షిర్డిసాయి బాబా ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకల్లో చైర్మన్ దంపతులు పద్మశ్రీ ప్రసాదరావు పాల్గొని పూజలు చేసారు.

ప్రజా భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం బలోపేతం



వడ్లపట్లలో డ్వాక్రా సంఘంలోని మహిళలతో మాట్లాడుతున్న ప్రతినిధుల బృందం సభ్యులు

భీమడోలు/ ఉంగుటూరు: రాష్ట్రంలో ప్రజాభాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న విధానాలను అమెరికాలోని పెగాసస్ క్యాపిటల్ ప్రతినిధుల బృందం పరిశీలన చేసింది. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం, రసాయనాల వినియోగంతో పండించే పంటలు, వాటి వినియోగం, దిగుబడులు, ఎరువులు, పురుగుమందుల వినియోగం తదితర అంశాలపై సాగు రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక వైస్ చైర్మన్ టి.విజయకుమార్ నేతృత్వంలో గురువారం వైట్ హౌస్ మాజీ జాతీయ వాతావరణం సలహాదారు గీనా మెకార్తీ, పెగాసస్ క్యాపిటల్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈవో క్రెగ్ కాట్, ప్రొడ్యూసర్స్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో కీత్ అగోడా తదితరుల బృందం క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల, కోడూరుపాడు గ్రామాల్లో పర్యటించింది. తొలుత ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరంలోని సురభి గోశాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయంలోని 9 సార్వత్రిక సూత్రాలను స్వయంగా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో అమలు చేస్తున్న విత్తన గుళికల తయారీ, ఘన జీవామృతం, అగ్నాస్త్రం వంటి విధానాలను పరిశీలించారు. అదే గ్రామంలోని రైతు టి.మల్లేష్ పొలంలో ఏటీఎం (ఏనీ టైమ్ మనీ) మోడల్‌తో పాటు నీటితో ప్రయోగాత్మకంగా వివిధ వ్యవసాయ విధానాల్లో బియ్యం ఉత్పాదకతను విశ్లేషణ చేసారు. అనంతరం భీమడోలు మండలంలోని వడ్లపట్ల గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కోడూరుపాడులోని ఏపీసీఎన్ఎఫ్ మెంటార్ ఇంటర్న్ కె.కల్యాణ్‌కుమార్ అమలు చేసిన ఏ గ్రేడ్ ప్రకృతి వ్యవసాయం నమూనాను, రసాయన పద్ధతిలో వ్యవసాయం చేసిన ఎస్.రాంబాబు పొలంతో పోల్చి రెండింటికి మధ్య గల వ్యత్యాసాన్ని గమనించారు. తర్వాత బృందం సభ్యులు యు.రామచంద్రరావుకు చెందిన 8 ఎకరాల కొబ్బరి తోటను సందర్శించారు. రసాయన ఆధారిత వ్యవసాయం చేసే ఎస్.రాంబాబు సాగు విధానాన్ని వివరించారు. అనంతరం కృష్ణ రాఘవ ప్రకృతి వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పొలాల్లో డ్రోన్ సహాయంతో జీవరసాయనాలను పిచికారీ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు అరుణ, ప్రభాకర్, విషి, జిల్లా మేనేజర్, తాతారావు, అసిస్టెంట్ మేనేజర్ బాలిన వెంకటేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కు



కొప్పాక ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రత్నప్రసాద్

పెదవేగి : భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, బాధ్యతలు, సమ న్యాయాన్ని కల్పించిందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ చెప్పారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ గురువారం జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా పెదవేగి మండలం కొప్పాకలోని హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ మాట్లాడుతూ సమాన న్యాయం అందరికీ అందుబాటులో ఉండటానికి ఆర్థికంగా వెనుకబడిన పౌరులకు ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్నాయని చెప్పారు. మార్చి 8న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, దీని ద్వారా కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి వెంకటేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం కే శైలజ, పెదపాడు ఎస్సై కృపావరం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదవేగి : పెదవేగి 132 కేవీ నుంచి 33 కేవీ కూచింపూడి సబ్‌స్టేషన్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఈనెల 21న విద్యుత్ సరఫరా నిలివేస్తామని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలోని 33/11కేవీ కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలోని కుచింపూడి, న్యాయంపల్లి, గోవిందవారిగూడెం, మైల్‌ఎనర్జీ ఇండస్ట్రియల్, కుచింపూడి ఫీడర్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. గోవిందవారిగూడెం ఏజీఎల్ ఫీడర్, న్యాయంపల్లి ఏజీఎల్ ఫీడర్ నుంచి 3 ఫేస్ కరెంట్ సరఫరా చేస్తామని తెలిపారు.

ఉంగుటూరు: స్థానిక సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు డీఈకేఎం అంబేడ్కర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు: జాతీయరహదారిపై నారాయణపురం వద్ద మోటార్‌సైకిల్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మోటార్‌సైక్లిస్టు అనిల్ గురువారం నారాయణపురం వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అనిల్‌కు, అతని తల్లి నిర్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ఆగడాలలంకలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలికా సంరక్షణాధికారి

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలిక సంరక్షణాధికారిణి కె.సూర్యచక్రవేణి అన్నారు. ఆగడాలలంక ఓరియంటల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కిశోర బాలికా వికాసం 2.0 కార్యక్రమంపై ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఏ.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీవో సూర్యచక్రవేణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి బాలిక, మహిళా చట్టాలపై అవగాహన కలిగి చైతన్యవంతులు కావాలని కోరారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తే టోల్ ఫ్రీ నం.1098కు విధిగా ఫోన్ చేయాలని సూచించారు. గ్రామస్థాయిలోని బాలిక సంరక్షణ కమిటీలు తమ వంతు పాత్రను పోషించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, మహిళా ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా తయారు చేయాలి




కాశిపాడు హైస్కూల్లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

గణపవరం: మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా నిర్వహించాలని, నాణ్యత విషయంలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం గణపవరం మండలం కాశిపాడు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట శాల పరిసరాలు పరిశీలించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు పరిశుభ్రంగా ఉండాలని, చేతులకు గ్లౌజ్‌లు తలపై క్యాప్ ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పరీక్షలకు ధైర్యంగా సన్నద్ధం కావాలని సూచించారు. అదనపు తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత చదువులకు వెళ్లాలని సూచించారు. హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ ఎన్నికపై సమీక్ష

ఉంగుటూరు: ఎస్సీ వర్గీకరణపై సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ అన్నారు. గురువారం ఉంగుటూరులో ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సురేష్ మాదిగ మాట్లాడుతూ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికపై పలు సూచనలు చేశారు. నియోజకవర్గ కన్వీనర్ మామూడూరి ఏలియ్య మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కాశీవనాశ్రమంలో సత్సంగ సమావేశం



గుండుగొలనులో చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఆధ్వర్యంలో విశేష పూజలు

భీమడోలు: గుండుగొలనులో కాశీవనాశ్రమంలో గుంటూరు జిల్లా నంబూరు కాశీవనాశ్రమ పీఠాధిపతులు మోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాంచాహ్నిక సత్సంగ సమావేశాలు కొనసాగుతున్నాయి. గురువారం ఆశ్రమంలో మాతాజీ భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. నారాయణ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసారు. ఈనెల 21న శుక్రవారం హనుమద్ కాశీవర ప్రసాద బాబూజీ వారి క్షీర శిలా మూర్తి ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు.